సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 21 । జనవరి । 2024



గుండెగుండెనూ తడుముతూ..

నరసన్నపేటలో 200వ రోజు గడపగడపకూ కార్యక్రమం జరగనుంది. మాకివలసలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. - 8లో



చట్టాలపై అవగాహన అవసరం

ద్వితీయ అర్ధ వార్షిక నేర సమీక్ష నిర్వహించారు. జిల్లా జడ్జి, ఎస్పీ పాల్గొని పలు అంశాలు చర్చించారు. - 8లో

పరీక్ష కేంద్రాల తనిఖీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో జవహర్ నవోదయ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును, వసతి, మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



దూదివారి కోవెలలో అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలో ఉత్తరాంధ్ర తిరుమల కొండగా పేరుగాంచిన నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని పూలమాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు.

'పెండింగ్ పనులు పూర్తి చేయండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన పలు శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్లలో మిగులు పనులు పూర్తి చేయాలని, రన్నింగ్ వాటర్ ఉండాలని, వాటికి సంబంధించి సూచిక బోర్డులు ప్రదర్శించాలని అన్నారు. పోలింగ్ కేంద్రంలో కావాల్సిన వెలుతురుకు లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇంకా 22 పోలింగ్ కేంద్రాల్లో భవనాలకు మరమ్మతులు, 42 చోట్ల మంచి నీరు, 43 చోట్ల విద్యుత్ సంబంధిత పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. దివ్యాంగులు వచ్చేందుకు వీలుగా 360 చోట్ల ర్యాంపులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మొత్తంగా 714 పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఈ నెలాఖరు నాటికి వాటిని కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. 15వ ఫైనాన్స్ నిధులను ఇందుకోసం వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో సమగ్ర శిక్ష పీఓ రోణంకి జయప్రకాష్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీఈఓ కె.వెంకటేశ్వరరావు, మున్సిపల్, పంచాయితీరాజ్, గిరిజన సంక్షేమ అధికారు లు పాల్గొన్నారు.

'రోగులకు మెరుగైన సేవలందించాలి'



పాతర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ సుజాత

రణస్థలం: గ్రామీణ ప్రాంత వాసులకు మనం చక్కగా వైద్యం అందిస్తే ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని వైద్యారోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత అన్నారు. మండలంలోని పాతర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం ఇలానే ఉండాలని ఆదేశించారు. ల్యాబ్, మందులు భద్రపరిచే గది పరిశీలించారు. డాక్టర్లు నిత్యం సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఓపీ పేషెంట్ల రిజిస్టర్లు, నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు, తరచూ సక్రమించే వ్యాధులపై ఆరా తీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో సక్రమంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, వైద్యులు డాక్టర్ కృష్ణచైతన్య, సీహెచ్ఓ వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్ చిరంజీవి, వైద్యులు ఉన్నారు.

లాలన పాలనే అర్హత

ఉపాధికి ఉండదు కొరత!

• స్వల్ప శిక్షణతో ఆ అవకాశం అందుకోవచ్చు

ఖాళీగా ఉండే బదులు ఏదైనా ఉద్యోగం చేసుకోవచ్చు కదా! పనీపాటా లేకుండా తిరిగేవారికి సహజంగా అందరూ ఇచ్చే సలహా ఇదే.. కానీ ఉద్యోగం కావాలంటే కనీసం టెన్తో, ఇంటరో, డిగ్రీయో ఉండాలి.. ఆ అర్హతలు లేని మాకు ఎవరు ఉద్యోగం ఇస్తారు.. అని చాలామంది నిట్టూర్చడం కూడా సహజమే! కానీ పైన చెప్పిన కనీస విద్యార్హతలు లేకపోయినా కొన్ని రకాల ఉద్యోగాలు, ఉపాధి పొందే అవకాశం ఉందని చాలామందికి తెలియదు. కనీస శిక్షణతో అటువంటి అవకాశాలు అందిపుచ్చుకోవడం ఎలాగో చూద్దాం.. – శ్రీకాకుళం డెస్క్





చిన్న పిల్లలంటే మీకు ప్రేమా.. వారిని చక్కగా చూసుకోగలరా.. వారిని ఆడిస్తూ.. లాలిస్తూ.. వారి మానసిక వికాసానికి దోహదపడే పనులు చేస్తే చాలు.. మీకు ఉపాధి గ్యారెంటీ.

వృద్ధుల బాగోగులు చూసుకోగలరా.. వారికి ఆహారం అందించడం.. స్నానం చేయించడం..ఆస్పత్రి నుంచి డిశ్చార్జై ఇంటికి వచ్చే సమయంలో వైద్య సేవలందించడం.. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతూ ఉన్న వారికి సేవలందించి సాటి కుటుంబ సభ్యుల్లా మసలుకోగలరా.. అయితే మీకూ ఉపాధికి ఢోకా లేదు.

జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న బొల్లినేని మెడిస్కిల్స్ బేబీ కేర్ టేకర్.. ఎల్డర్లీ కేర్ టేకర్‌ల విభాగాల్లో ఉచితంగా శిక్షణ అందిస్తోంది. ఉపాధి కల్పనే తమ ధ్యేయమని చెబుతోంది. ఈ కోర్సులు నేర్చుకునేందుకు కావాల్సిన అర్హతలు ఏమిటి..

బేబీ కేర్ టేకర్..

అమెరికాలో నానీల మాదిరిగా ఇంట్లో ఉన్న చిన్నారుల ఆలనా పాలన చూస్తూ బాలవికాసానికి సంబంధించి తర్ఫీదునిస్తూ ఆటలపాటల్లో వారిని తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

శిక్షణ కాలంలో ఏం నేర్పిస్తారు...

పిల్లల పెరుగుదల(శారీరకంగా, మానసికంగా) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లల అవసరాలు తెలుసుకోవడం.. పిల్లలతో సానుకూల సంబంధాలు.. తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు.



విద్యార్హత: ఎనిమిదో తరగతి
శిక్షణ కాలం: రెండు నెలలు
ఫీజు: పూర్తి ఉచితం.

శిక్షణ అనంతరం ఉపాధి ఎలా..

జీడీఏ, పీఆర్ఏ కోర్సులు సైతం..

ఇంటర్ పాస్/ఫెయిల్ అర్హతతో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులో మూడు నెలలు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఆస్పత్రిలోనే ఉపాధి కల్పిస్తున్నారు. అదే విధంగా డిగ్రీ పాసైన వారి కోసం ఉచితంగా పేషెంట్ రిలేటెడ్ అసోసియేట్ కోర్సు కూడా అందిస్తున్నారు.

ఒంటరి మహిళలకు సరైన ఉపాధి..

ఒంటరి మహిళలు.. వితంతువులకు కేర్ టేకర్ కోర్సులతో సరైన ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు నిర్వాహకులు. నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందంటున్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయంగా..



బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నాం. సత్వరమే ఉపాధి లభించే కోర్సులు చాలా ఉన్నాయి. బేబీ కేర్ టేకర్ కోర్సును ప్రారంభిస్తున్నాం. ఎల్డర్లీ కేర్ టేకర్ కోర్సు ఇప్పటికే ప్రారంభమైంది. మొదటి బ్యాచ్‌లో 25 మందికి శిక్షణ ఇచ్చాం. ఈ కోర్సులకు డిమాండ్ బాగా ఉంది. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ మెడికల్ కళాశాలలో లేనివిధంగా 17 పారామెడికల్ డిగ్రీ కోర్సులు, 15 పారామెడికల్ డిప్లొమో, 8 పీజీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చాం.

– సీహెచ్.నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బొల్లినేని మెడిస్కిల్స్

ఎల్డర్లీ కేర్ టేకర్..

వృద్ధులకు సేవలందించడమే ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. స్నానం చేయించడం నుంచి మందులు అందించడం వరకు అన్ని రకాలుగా వారికి చేదోడుగా వాదోడుగా ఉంటే సరిపోతుంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వారికి ఆరోగ్య సేవలందించేందుకు అవసరమైన శిక్షణ కూడా ఇందులో భాగంగా అందిస్తున్నారు.

శిక్షణ కాలంలో ఏం నేర్పిస్తారు..

రోజువారీ కార్యకలాపాలు, వ్యక్తిగత శుభ్రత, ఆహారాన్ని సిద్ధం చేయడం, ఆహారం తీసుకోవడంలో సాయమందించడం, వృద్ధుల గది నిర్వహణ ఇతర అంశాలపై శిక్షణ ఇస్తారు.



విద్యార్హత: ఎనిమిదో తరగతి
శిక్షణ కాలం: రెండు నెలలు
ఫీజు: పూర్తి ఉచితం.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు 7170 మంది హాజరు



రణస్థలం: ఆదర్శ పాఠశాల కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి 7170 హాజరైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య వెల్లడించారు. జిల్లాలో 34 కేంద్రాల్లో ఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించామని తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం 8430 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1260 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 9న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆయన శనివారం కోర్టు హాల్‌లో జిల్లాలోని పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయడానికి గల అవకాశాల గురించి ఆలోచించి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాలోని అదనపు జిల్లా జడ్జిలు శ్రీదేవి, భాస్కరరావు, మహేంద్ర ఫణి కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు, అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు చురుగ్గా కులగణన



వజ్రపుకొత్తూరు: అనంతగిరిలో కులగణన చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రెండో రోజు కులగణన చురుగ్గా జరిగింది. జిల్లాలో అన్ని మండలాల్లో ఈ గణన జరుగుతోంది. అధికారుల సమక్షంలో ఇంటింటా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. శనివారం నాడు జిల్లాలో 732 సచివాలయాల్లో ఈ సర్వే నిర్వహించారు. 9814 క్లస్టర్లలో 1,13,243, కుటుంబాలను, ఆ పరిధిలో ఉన్న 2,47,974 మంది సభ్యులను సర్వే చేసి, వారి కులాలను నమోదు చేశారు. కార్యక్రమంలో అన్ని స్థాయిల అధికారులు పాల్గొన్నారు. ఇంకా ఎనిమిది రోజులు ఈ సర్వే చేసేందుకు గడువు ఉంది.

ఖేలో ఇండియా యూత్ నేషనల్స్‌కు నలుగురు ఎంపిక



కె.సౌమ్యారాణి (జూడో) | ఇ.జయకృష్ణ (రెజ్లింగ్) | ఎం.సత్యం (వాలీబాల్) | బి.అభిరామ్ (వాలీబాల్) | మణికుమార్ (జూడో కోచ్)

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ నేషనల్ గేమ్స్‌కు శ్రీకాకుళం జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 31వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీలు చెన్నై వేదికగా మొదలయ్యాయి. ఈ పోటీలకు జూడో, రెజ్లింగ్, వాలీబాల్ ఈ మూడు క్రీడాంశాల్లో నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి జూడో క్రీడకు కడపల సౌమ్యారాణి, రెజ్లింగ్ క్రీడకు ఈదు జయకృష్ణ, వాలీబాల్‌కు మైలపల్లి సత్యం, బడ్డ అభిరామ్ ఎంపికయ్యారు. వీరంతా ఇంటర్మీడియెట్, డిగ్రీ చదువుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న వీరంతా ఈ పోటీల కోసం ఇప్పటికే చెన్నై చేరుకున్నారు.

ఏపీ జూడో హెచ్ కోచ్‌గా మణికుమార్..

ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూడో బృందానికి హెడ్ కోచ్‌గా జిల్లాకు చెందిన శాప్ జూడో కోచ్ పీఎస్ మణికుమార్ నియమితులయ్యారు. ఖేలో ఇండియా యూత్ నేషనల్ గేమ్స్‌కు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపిక, కోచ్‌గా నియామకంపై జిల్లా క్రీడాప్రాధికార సంస్థ డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారుడు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, బీవీ రమణ, పోలినాయుడు, ఆయా క్రీడాసంఘాల ప్రతినిధులు, డీఎస్ఏ కోచ్‌లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అత్యుత్తమ ప్రతిభను కనబర్చి పతకాలతో జిల్లాకు తిరిగి రావాలని వారంతా ఆకాంక్షించారు.

శంబర జాతరకు చకచకా ఏర్పాట్లు

- ఈ నెల 22, 23, 24 తేదీల్లో శంబర జాతర
- ఏర్పాట్లు పూర్తిచేస్తున్న అధికార యంత్రాంగం
- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ సునిల్ సొరేన్
- చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌ను పరిశీలించిన జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు



శంబర పోలమాంబ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరగనుంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా దేవదాయ శాఖ అధికారి ప్రసాదరావు, ఏఎస్పీ సునీల్‌సొరెన్ పరిశీలించారు. చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తాగునీరు, పిల్లలకు పాలు, ప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై ఆరా తీశారు. శంబర జాతరను రాష్ట్రజాతరగా ప్రభుత్వం గుర్తించిందని, లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సిరిమానోత్సవానికి పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు.

జాతరకు పటిష్టబందోబస్తు

పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ సునీల్‌సొరేన్ శంబర గ్రామానికి చేరుకొని జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. జాతరలో సుమారు 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్టు సీఐ ధనుంజయరావు తెలిపారు. 44 చోట్ల సీసీ కెమెరాలు అమర్చామన్నారు. సిరిమాను రథాన్ని నడిపే భక్తుల పేర్లు సోమవారం అందిస్తామని చెప్పగా, 50 మందికి మించరాదని ఏఎస్పీ సూచించారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వాహనదారులు రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు జిల్లాలో అనేక చోట్ల రోడ్డు భద్రతపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయన తన చాంబర్‌లో శనివారం రహదారి భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనం నడపడం నేరమన్నారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంతో నడపటం మంచిది కాదని పేర్కొన్నారు. వివిధ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్, రవాణా శాఖ అధికారి ఎస్ఎల్‌వీ ఎం.దేవి, పరిపాలన అధికారి ఎస్ఆర్ఎం రాజు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పీవీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గురి తప్పకూడదు: ఎస్పీ



చినరావుపల్లి ఫైరింగ్ రేంజ్‌లో సాధన చేస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు వృత్తి నైపుణ్యంలో భాగంగా ఫైరింగ్ సాధన తప్పనిసరిగా చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసుల ఫైరింగ్ రేంజ్ చినరావుపల్లిలో పోలీస్ అధికారుల ఫైరింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. అన్ని రకాల గన్స్ పనితీరు, ఫైరింగ్ విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు లక్ష్యాలు నిర్దేశించుకొని ఫైరింగ్ చేశారు. ఆయుధాలపై అవగాహనతోనే వినియోగంలో మెలకువలు తెలుస్తాయని అన్నారు. అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డి.బాలచంద్రారెడ్డి, జి.నాగేశ్వర్‌రెడ్డి, ఎ.విజయ్‌కుమార్, ఎస్.వాసుదేవ్, జి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

• సర్వం రామమయం



శ్రీకాకుళం కల్చరల్: అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ట కోసం శ్రీకాకుళంలో సంఘీభావ ర్యాలీ

క్లుప్తంగా

'వ్యక్తిగత లక్ష్యాలు కీలకం'



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత చదువుల్లో ఉన్న వారు వ్యక్తిగత లక్ష్యాలతో ముందుకు సాగాలని శ్రీకాకుళం ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్, జెండర్ సెన్సిటైజేషన్ అంశాలపై శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకుని కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం, సోషల్ మీడియా వంటి వాటిని పరిమితి మేరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. వ్యసనంగా మారితే జీవితం నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చక్రవర్తి పాల్గొన్నారు.

మార్చి 8 నాటికి పరిపాలన భవనం పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మార్చి 8వ తేదీ నాటికి నిర్మాణంలో ఉన్న పరిపాలన భవనం పూర్తి చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య చెప్పారు. ఆయన శనివారం రిజిస్ట్రార్ కార్యాలయంలో మాట్లాడుతూ రూ.35 కోట్లతో భవనం కేంద్ర ప్రజాపనుల విభాగం నిర్మిస్తోందని తెలిపారు. ప్రస్తుతం రెండు ఫ్లోర్లు పూర్తయ్యాయని తెలిపారు. ఉన్నత విద్యా మండలి వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల్లో నిర్వహిస్తున్న పోలింగ్ బూత్‌ల నిర్వహణ వివరాలు అడిగిందని, వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల్లో ఎలాంటి బూత్‌లు లేవని అన్నారు.

23న మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 23న మూడేళ్ల ఎల్‌ఎల్‌బీలో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం వివరాలు వెల్లడించారు. మొత్తం 40 సీట్లు ఉండగా, లా సెట్-2023 ద్వారా నిర్వహించిన రెండు విడతల కౌన్సెలింగ్‌లో 29 మంది ప్రవేశాలు పొందారని చెప్పారు. 11 సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఉన్నత విద్యా మండలి నిబంధనల మేరకు ఈ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్పాట్ అడ్మిషన్లకు లాసెట్- 2023లో ర్యాంకు తప్పనిసరని పేర్కొన్నారు. ర్యాంకు వచ్చి సైతం ఏ కళాశాలలో చేరకూడదని, 10వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ విధానంలో విద్యార్హత ఉండాలని, డిగ్రీలో ఓసీలకు 45 శాతం, బీసీలకు 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం మార్కులు ఉండాలని అన్నారు. టీసీ తప్పనిసరని తెలిపారు. 23న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ ప్రవేశాల ప్రక్రియ సాగుతుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వర్తించవని, విద్యార్థులు పూర్తిస్థాయిలో ట్యూషన్, ఎగ్జామినేషన్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. న్యాయ కళాశాలలో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఒడిశా ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై కేసు నమోదు

జలుమూరు: లింగాలవలస వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వాన తులసీదాస్ మృతి చెందిన విషయం విదితమే. తులసీదాస్ మృతికి కారణమైన ఒడిశా ఆర్టీసీ బస్ డ్రైవర్ బబ్బురు బహాన్ సబర్ పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



పొలంలో విద్యుత్ వైర్లు తగిలి చనిపోయిన సూర్యనారాయణ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా గ్రామానికి చెందిన రైతు బమ్మిడి సూర్యనారాయణ (48) శనివారం ఉదయం పొలం పనులకు వెళ్తూ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందారు. పొలాల మధ్యలో హైటెన్షన్ వైర్లు తెగి పడిపోయి ఉన్నాయి. ఉదయం మంచులో అవి కనిపించకపోవడంతో వాటిపై నడుచుకుంటూ వెళ్లి ప్రమాదానికి గురయ్యాడని స్థానికులు తెలిపారు. ఈయనకు భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెగుండెనూ తడుముతూ..



మడపాంలో ఒక వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట నియోజకవర్గంలో నేడు 200వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం
- ఎంతో సంతృప్తి ఇచ్చిందంటున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- ఇప్పటివరకు నియోజకవర్గంలో 62,955 గృహాల సందర్శన
- రూ. 15 కోట్లతో 75 సచివాలయాల్లో అభివృద్ధి పనులు



సారవకోట మండలం పెదలంబలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు తిలకం దిద్దుతున్న ఒక వృద్ధురాలు(ఫైల్)

నరసన్నపేట: పల్లెపల్లెనూ పలకరిస్తూ.. గడపగడపనూ సందర్శిస్తూ నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ జనం గుండెకు మరింత దగ్గరయ్యారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 199 రోజులు నిర్వహించి 200వ రోజుకు చేరువయ్యారు. ఈ సందర్భంగా నరసన్నపేట మండలం మాకివలసలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఏడాది కిందట ముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మొదలుపెట్టారు. పోలాకి మండలం ఈదులవలస నుంచి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో 91 సచివాలయాలు ఉండగా 75 సచివాలయాల్లో పూర్తి చేశారు. వందవ రోజు మబగాంలో, 150వ రోజు వీరన్నాయుడు కాలనీలో నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలపై వారి చెంతనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవి పరిష్కారం అయ్యేందుకు కృషి చేశారు. 75 సచివాలయాల్లో రూ. 15 కోట్లతో వివిధ పనులు నిర్వహించారు. నియోజకవర్గంలో 83,290 గృహాలు ఉండగా ఇప్పటి వరకూ 62,955 గృహాల్లో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకి నీరాజనం పలికారు.

మాకివలసలో..

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో 200 వ రోజుకు చేరుకోవడంతో మండలం మాకివలసలో ఆదివారం పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించడానికి సర్పంచ్ మోహనరావు బృందం ఏర్పాట్లు చేసింది. గడపగడపకూ కార్యక్రమంతో పాటు సభను నిర్వహిస్తున్నారు. దీంట్లో నియోజకవర్గం ప్రధాన నాయకులు, కార్యకర్తలు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కార్యక్రమం ప్లాన్ చేశారు.

సంతోషంగా ఉంది

గడపగడపకూ కార్యక్రమం ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందో నాకు తెలుసు. పలు మార్లు నేరుగా సీఎం దీనిపై సమీక్ష చేశారు. దీంతో ఎన్ని కార్యక్రమాలు ఉన్నా గడపగడపకూ మరిచిపోకుండా నిర్వహిస్తూ వచ్చాను. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్నప్పుడు లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం నాకు ఎంతో తృప్తిని ఇచ్చింది. టీడీపీ వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు కూడా వారు ఆదరించారు. వారూ ప్రభుత్వ ప్రయోజనం పొందారు. మిగిలిన సచివాలయాలు కూడా వీలున్నంత తొందరగా పూర్తి చేస్తాను. గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం సందర్భంగా నాతో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు మనసు పూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. కార్యక్రమం నిర్వహణలో నా భార్య పద్మప్రియ, కుమారుడు కృష్ణ చైతన్యల సహకారం ఎంతో ఉంది.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి అహ్మద్ మౌలానా, ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: ప్రస్తుత కాలంలో మారుతున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక అధ్యక్షతన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసు అధికారులతో శనివారం జరిగిన ద్వితీయ అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేసుల దర్యాప్తు, దర్యాప్తులో ఎదురయ్యే లీగల్ సమస్యలు, నేరప్రవృత్తి, నేరతరహా వంటి అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో చర్చించామని ఎస్పీ రాధిక జిల్లా జడ్జికి తెలిపారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ చట్టాల అవగాహనపై నిపుణులతో ఆన్‌లైన్ సెమినార్ ద్వారా కొత్త అమెండ్‌మెంట్స్, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రతి అంశాన్ని పఠించాలని సూచించారు. కేసుల దర్యాప్తు చట్ట పరిధిలో జరపాలని, నియమాలు పాటిస్తే శిక్షలు పడతాయని, పెండింగ్ కేసులకు వీలైనంత మేరకు సీసీ నంబర్లు మంజూరుచేస్తామని తెలిపారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ గత ఏడాదిలో నేరాల నివారణకు తీసుకున్న పటిష్ట చర్యలతో నేరాలు తగ్గుముఖం పట్టాయని, అదే విధంగా గత ఏడాదిలో అత్యధికంగా కేసులు డిస్పోజెల్ చేయగలిగామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో అప్రమత్తతతో పనిచేయాలని అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి వారంలో కనీసం రెండు రోజులు సందర్శించి ఎలాంటి అవాంతరాలు, అల్లర్లు జరగకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్రమ మద్యం, నగదు తరలింపు లేకుండా చర్యలు తీసుకోవాలని 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బందితో సంయుక్తంగా క్షేత్రస్థాయిలో దాడులు చేపట్టాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రచారం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆస్తి నేరాలపై కూడా దిశా నిర్దేశం చేశారు. అపార్ట్‌మెంట్లు, ఒకే ఇల్లు ఉన్న చోట, దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అదనపు ఎస్పీలు విఠలేశ్వరరావు, తిప్పేస్వామి, డీఎస్పీలు బాలచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, శృతి, వాసుదేవ్, ప్రసాదరావు, ట్రైనీ డీఎస్పీ రాజా, ఏఆర్ డీఎస్పీ కెఎస్ వాసాన్, ఏట గోపీనాథ్, జిల్లావ్యాప్తంగా ఉన్న సీఐలు, ఎస్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెబ్ సీఐ, ఎస్‌ఐలకు బదిలీలు



శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకి చెందిన సీఐలు, ఎస్‌ఐలకు బదిలీలయ్యాయి. జిల్లా నుంచి 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 14 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం చేస్తూ ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

సీఐలు	ప్రస్తుతం పనిచేసిన చోటు	బదిలీ జరిగిన చోటు
కె.రాజారావు	గొలుగొండ	ఆమదాలవలస
అబ్దుల్ కలీమ్	అనకాపల్లి ఐవి	పురుషోత్తపురం చెక్‌పోస్టు
జె.కూర్మారావు	పాడేరు డీటీఎఫ్	శ్రీకాకుళం ఇంటెలిజెన్స్
ఎల్.గణపతిబాబు	అరకు	పాతపట్నం
కె.గాయత్రి	ఐడబ్ల్యూ అల్లూరి సీతారామరాజు	కోటబొమ్మాళి
పి.రామచంద్రకుమార్	విజయనగరం-2	టీడీఎఫ్ పలాస
ఎంఆర్‌వీ అప్పారావు	భోగాపురం	పొందూరు
జీఎస్ రాజశేఖరనాయుడు	నెల్లిమర్ల	టెక్కలి
ఎం.విజయలక్ష్మి	గజపతినగరం	రణస్థలం
ఆర్.జైబీమ్	బొబ్బిలి	సోంపేట
ఎంవీ గోపాలకృష్ణ	పార్వతీపురం ఐవి	శ్రీకాకుళం
జి.శ్రీనివాస్	నర్సీపట్నం	పాలకొండ
ఎ.సంతోష్	పాడేరు	పార్వతీపురం
ఎస్‌ఐలు		
ఎల్.మాధవి	మహారాణిపేట	శ్రీకాకుళం
కె.అనీల్‌కుమార్	విశాఖ డీటీఎఫ్	ఇచ్ఛాపురం
కెఎస్ గణేష్	యలమంచిలి	టెక్కలి
టీవీ గిరిబాబు	గొలుగొండ	పలాస
రమణారావు	అరకు	పలాస
బి.శ్రీనివాసరావు	సబ్బవరం	పాతపట్నం
జానకికావ్య	అనకాపల్లి	నరసన్నపేట
చినవీర్రాజు	పాడేరు	శ్రీకాకుళం డీటీఎఫ్
కరుణ లత	విజయనగరం	ఆమదాలవలస
నాగలక్ష్మి	నెల్లిమర్ల	రణస్థలం
ఎం.రవిప్రసాద్	కునేరు చెక్‌పోస్టు	రణస్థలం
పి.నరేంద్రకుమార్	కొత్తవలస	ఇచ్ఛాపురం బీఎంపీపీ
నాగేశ్వరరావు	సాలూరు	పాతపట్నం
షామిల	పార్వతీపురం	శ్రీకాకుళం డీటీడబ్ల్యూ/సీఆర్

ఆటో ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

నరసన్నపేట: జాతీయ రహదారికి ఆనుకొని సర్వీసు రోడ్డులో గ్యాస్ గిడ్డంగి వద్ద శనివారం సాయంత్రం జరిగిన ఆటో ప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆటోను గ్యాస్ గిడ్డంగి వద్ద కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న వారంతా గాయపడ్డారు. వీరిలో కోరాడ విజయలక్ష్మితో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విజయలక్ష్మి నరసన్నపేటలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మరో ఇద్దరిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వీరి పేర్లు తెలియాల్సి ఉంది. అలాగే గార మండలం పెద్ద తూలుగుకు చెందిన బంటుపల్లి చిన్నమ్ముడు ఈమె బంధువు గడ్డి నీరూషాలతో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

ఏడు పేపర్లతో టెన్త్ పరీక్షలు

- ఏపీ పాఠశాల విద్య ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి



పాఠశాల విద్య పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎంఈఓల సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ఆరు సబ్జెక్టులకుగాను.. ఏడు పేపర్లతో జరగనున్నాయని ఏపీ పాఠశాల విద్య ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని వివరించారు. సమస్యాత్మక కేంద్రాలతోపాటు ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో పదో తరగతి పరీక్షలు జరగనున్న పలు కేంద్రాలతోపాటు స్పాట్ వాల్యుయేషన్ జరగనున్న కేంద్రాల పరిశీలన కోసం శనివారం రాత్రి ఆయన జిల్లాకు వచ్చారు. ఆదివారం ఆయా కేంద్రాల సందర్శనతోపాటు సోషల్ స్టడీస్ సబ్జెక్టు ఫోరం ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు. శనివారం రాత్రి ఆయనను డీఈఓ కె.వెంకటేశ్వరరావు, ఎగ్జామినేషన్స్ ఏసీ లియాఖత్ ఆలీ ఖాన్, ఎంఈఓల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ దాలినాయుడు, డీసీఈబీ సెక్రటరీ గెడ్డాపు రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.సత్యనారాయణ, వై.వాసుదేవరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, ఎస్‌ఎల్‌టీఏ పిసిని వసంతరావు, యూటీఎఫ్ నుంచి సంపతిరావు కిశోర్‌కుమార్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులు, పలువురు ఉపాధ్యాయులు కలిశారు.

సోషల్ స్టడీస్‌కు మంచి రోజులు..

ప్రభుత్వ పాఠశాలల్లో సాంఘిక శాస్త్రం సబ్జెక్టుపై ప్రత్యేకమైన అవగాహన ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సోషల్ సబ్జెక్టు ఫోరంను సంఘటితంగా ఏర్పాటు చేస్తున్నట్టు సోషల్ స్టడీస్ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు ముక్కా శ్రీనివాసరావు, బాడాన రాజు, సనపల రామకృష్ణ పేర్కొన్నారు. విషయ అవగాహన పెంచుకోవడం, సరికొత్త ధోరణిలతో పరిచయం, సబ్జెక్టు బోధనలో మెలకువలు నేర్చుకుని.. వాటిని తరగతి గదిలో అమలు పర్చడానికి సోషల్ స్టడీస్ ఫోరంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫోరం ప్రారంభోత్సవానికి దేవానందరెడ్డి హాజరవుతుండటం సంతోషంగా ఉందని శ్రీనివాస్, రాజు, రామకృష్ణ పేర్కొన్నారు.

కొట్లాటలో ఏడుగురిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశంలో భూ సర్వే దగ్గర శుక్రవారం ఇరు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనికి సంబంధించి రెండు వర్గాలకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేశారు. గాయపడిన మూగి శ్రీరాములు, చంద్రశేఖర్‌లను నుంచి ఫిర్యాదు స్వీకరించి, చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో పోలీసులు చేర్పించారు. అనంతరం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్నట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు ఇంటి పట్టాలు



కాశీబుగ్గ ఫ్లై ఓవర్ నిర్వాసితులకు పట్టాలు అందిస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఆర్డీఓ భరత్ నాయక్

కాశీబుగ్గ: కాశీబుగ్గ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మంత్రి సీదిరి అప్పలరాజు ఈ కార్యక్రమం నిర్వహించారు. 2007లో మొదలు పెట్టిన ఈ నిర్మాణం 16 ఏళ్లుగా పూర్తి కాలేదని, నిర్వాసితుల సహకారంతో ఇప్పుడు ముమ్మరంగా పనులు చేయిస్తున్నామని తెలిపారు. అనివార్య కారణాల వల్ల నష్టపరిహారం అందించడంలో ఆలస్యం జరిగిందని, తప్పిదాలను పరిష్కరించి మిగిలిన వారికి కూడా పరిహారం అందిస్తామన్నారు. మొత్తం 128 మందిలో 125 మందికి హౌస్ సైట్లు కేటాయించడం జరిగిందని, మిగిలిన మూడు ప్రభుత్వ ఆస్తులని తెలిపారు.

రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు ఇస్తున్న 125 హౌస్ సైట్ల కోసం ప్రభుత్వం స్థల పరిశీలన చేసి లేఔట్ వేస్తే దానిపై కూడా ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేశారని అన్నారు. పలాస కేటీ రోడ్ విస్తీర్ణం చేయడం వల్ల పలాస రూపురేఖలు అమాంతంగా పెరిగాయని, బహుళ స్థాయి వ్యాపార సంస్థలు మన ఊరికి రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. రోడ్డు విస్తరణ వెనుక పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కృషి ఉందని అన్నారు. కోసంగిపురం నుంచి బెండి వరకు డబుల్ రోడ్ విత్ లైటింగ్‌తో నిర్మించడం జరుగుతుందని, అలాగే ఇందిరాగాంధీ చౌక్ నుంచి మొగలిపాడు వరకు రోడ్డుని 60 అడుగుల విస్తీర్ణంతో త్వరలోనే నిర్మిస్తామన్నారు. హైవేని ఆనుకుని 150 ఎకరాల్లో స్మార్ట్ లే ఔట్ నిర్మాణం, 2500 ఇళ్లతో జగనన్న లేఔట్ నిర్మాణం, దానికి ఎదురుగా టిడ్కో కాలనీ నిర్మాణం చేయడం, దాన్ని ఆనుకొని 900 ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని, 65 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మించబోతున్నామని తెలిపారు. మనకు సమీపంలో మూలపేట వద్ద నిర్మిస్తున్న పోర్ట్‌కి అనువుగా పలాసలోనూ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్ లంబాల మధుసూదనరావు, ప్రభుత్వ విప్, స్థానిక కౌన్సిలర్ శంకర్ పండా, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరిరావు, యువజన నాయకులు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యం



వైఎస్సార్‌సీపీ కండువాల్ని కప్పి స్వాగతిస్తున్న సమన్వయకర్త పిరియా విజయ, సర్పంచ్ బద్రి ప్రకాష్

కవిటి: సంక్షేమాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ నివాసంలో బి.గొనపపుట్టుగ పంచాయతీకి చెందిన 17 కుటుంబాల వారు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ సమన్వయకర్త పిరియా విజయ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఇచ్ఛాపురం స్థానాన్ని గెలిచి సీఎంకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బద్రి ప్రకాష్ పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

గిరిజనులకు వైఎస్సార్ ఆసరాపై అవగాహన



వైఎస్సార్ ఆసరా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మందస: మండలంలోని గిరిజన పంచాయతీ కుసుమలలో వైఎస్సార్ ఆసరా ప్రీ లాంచింగ్ అవగాహన సదస్సు శనివారం జరిగింది. సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరాతో మహిళల కుటుంబాల్లో ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సవర సుధాకర్, వీటీఏ సవర జగబంధు, ఆసరా లబ్ధిదారులు, స్వయంశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.